క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



నగదును అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

సోమల: మండలంలోని కందూరు పంచాయతీ పగడాలవారిపల్లెకు చెందిన నవీన్‌కుమార్ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఎంపీపీ అందజేశారు. నవీన్‌కుమార్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన భార్యకు బీమా సాయాన్ని ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్ అందజేశారు. పంచాయతీ కార్యదర్శి జైశంకర్, వైఎస్సార్‌సీపీ నేత మెకానిక్ బాషా పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

సదుం: స్థానిక మహాత్మా జ్యోతీరావ్ పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఏపీ మ్యాథమాటిక్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 49వ గణిత ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి మంగళవారం తెలిపారు. 20 మంది విద్యార్థులు 11 ర్యాంకులను సాధించారని ఆయన చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఈనెల 15న మంగళగిరిలోని ఎస్ఎంఆర్ యూనివర్సిటీలో సత్కరిస్తారని చెప్పారు.

జ్వరాలపై అప్రమత్తత



కందూరులో మందుల పిచికారీ

సోమల : విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి జైశంకర్, వైఎస్సార్‌సీపీ నేత బాషా అన్నారు. మంగళవారం కందూరు పంచా యతీలో మలేరియా, డెంగీ జర్వాలు వ్యాపించకుండా ముందస్తుగా స్థానిక వైద్య సిబ్బంది సూచనల మేరకు బ్లీచింగ్ చల్లించారు. మందులను పిచికారీ చేయించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

రెండు ఆలయాల్లో హుండీ లెక్కింపు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కానుకల లెక్కింపు

పలమనేరు : పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వర, సత్యగంగమ్మ ఆలయాల్లో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. సత్య గంగమ్మ ఆలయానికి రెండు నెలల ఐదు నెలలకు సంబంధించి రూ.74.51వేలు, శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయానికి 5 నెలలకు సంబంధించి రూ.2.20 లక్షలు మొత్తం రూ.2.94 లక్షలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ కమలాకర్ పేర్కొన్నారు. కానుకల లెక్కింపును ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పర్యవేక్షించారు.

సారా విక్రేత అరెస్టు

సదుం: సారా విక్రేతను అరెస్టు చేసినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. మండలంలోని ఇందిరానగర్ తాండాకు చెందిన తులసీనాయక్ ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా పట్టుకుని, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఇద్దరి అరెస్టు



పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న డీటీఎఫ్ బృందం

పలమనేరు: పలమనేరు సమీపంలోని చెన్నై–బెంగళూరు హైవేలో పత్తికొండ– గండ్రాజుపల్లె మధ్య చిత్తూరు డీటీఎఫ్(డిస్టిక్ టాస్క్‌ఫోర్స్) బృందం మంగళవారం కర్ణాటక నుంచి మోటార్ సైకిల్‌లో మద్యం తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వీరినుంచి 21 బాటిళ్ల విస్కీ,12 బాటిళ్ల బీరు బాటిళ్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో గంగవరం మండలం పత్తికొండకు చెందిన రామప్ప(48), పలమనేరుకు చెందిన సుభాన్‌బాష(32)గా గుర్తించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు సీఐ మాధవస్వామి తెలిపారు.

సర్వర్ డౌన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బుధవారం నెట్ సక్రమంగా రాకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారులు అవస్థలు పడ్డారు. ఉదయం 10 నుంచి 12 వరకు నెట్ దాదాపుగా లేదు. అనంతరం సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ సెంట్రల్ వెబ్‌సైట్ పనిచేయలేదు. ఈసీ, సీసీలు నెమ్మదిగా వచ్చిన కేవైసీ కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

వార్ వన్‌సైడే!

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకే భారీగా ఓట్లు..!
- పోలింగ్ సరళిని బట్టి రాజకీయ విశ్లేషకుల అంచనా
- జగనన్న పాలనను నమ్మి ఓట్లేసిన ఓటర్లు
- నియోజకవర్గంలో గంగవరం పోలింగ్‌లో టాప్



పలమనేరు పట్టభద్రుల బూత్‌లో సోమవారం బారులు తీరిన ఓటర్లు

పలమనేరు: తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ స్థానమైన ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో వార్ వన్ సైడ్‌గా కనిపిస్తోంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సరళిని బట్టి పలమనేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మంచి మెజారిటీ దక్కనున్నట్టు స్పష్టమైంది. ఈ మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై నమ్మకంతో ఓటర్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించినట్టు ఓటింగ్ సరళిని బట్టి తెలుస్తోంది.

భారీ మెజారిటీ ఖాయం...

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి 60శాతంమంది ఓట్లేసినట్టు ఓటర్ల మనోగతాన్ని బట్టి తెలుస్తోంది. టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ నాయుడుకు 30 శాతం, పీడీఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి దయాకర్‌రెడ్డిలతో పాటు స్వతంత్రులకు ఇక్కడ పదిశాతం ఓట్లు పడినట్లు ఓటర్ల సరళిని బట్టి చెప్పవచ్చు. స్వతంత్ర అభ్యర్థుల్లో స్థానికుడైన పూసల రవికి ఇక్కడ కొంత మేర ఓట్లు పోలైనట్టు తెలుస్తోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి 50 శాతం, ఉపాధ్యాయ సంఘాలైన యూటీఎఫ్, ఎస్టీయూ, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాలు బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి బాబురెడ్డికి 40శాతం, టీడీపీతో పాటు ఇతర స్వతంత్ర అభ్యర్థులకు పదిశాతం ఓట్లు పడినట్టు తెలుస్తోంది. ఓటింగ్ సరళిని బట్టి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు స్పష్టమైన మెజారిటీ ఖాయమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

పోలింగ్‌శాతంలో గంగవరం మండలం టాప్

పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలోని గంగవరం మండలం 86.60 శాతం పోలింగ్‌తో టాప్‌లో నిలిచింది. టీచర్లకు సంబంధించి పెద్దపంజాణి మండలంలో 96.30 శాతం పోలింగ్ నమోదైంది.

మండలాల వారీగా పోలింగ్

మండలం	పట్టభద్రులు	పోలింగ్	శాతం	టీచర్లు	పోలింగ్	శాతం
గంగవరం	1209	1047	86.60	114	105	92.11
వీకోట	1712	1445	84.40	134	125	93.28
పెద్దపంజాణి	925	769	83.14	27	26	93.28
పలమనేరు రూరల్	638	519	81.35	0	0	0
మున్సిపాలిటీ	2514	1967	78.24	365	312	87.89
బైరెడ్డిపల్లె	1043	833	79.87	55	49	89.09
మొత్తం	8041	6580	81.83	685	617	90.07

ఓర్వలేకే దొంగ ఓట్ల రాద్ధాంతం

- పట్టుబడింది టీడీపీ మద్దతుదారుడే
- అవాస్తవ ఆరోపణలు గర్హనీయం
- వైఎస్సార్‌సీపీ నాయకుల స్పష్టం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు

చౌడేపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధిని చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓట్లు వేశారని, దొంగ ఓట్లు వేయించాల్సిన అవసరం తమకు లేదని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయం వద్ద సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చౌడేపల్లెలో దొంగ ఓట్లు వేశారని కొందరు టీడీపీ నాయకులు ఆరోపించడం తగదన్నారు. ఎల్లో మీడియా ద్వారా అసత్య ఆరోపణలు చేయడం నీచాతి నీచమని ఆరోపించారు. దొంగ ఓటు వేశాడని మీరు పట్టుకున్న వ్యక్తి గతంలో సింగిల్ విండో డైరెక్టర్ పదవి కోసం టీడీపీ తరఫున దిగువపల్లెలో పోటీ చేసి ఓటమి చెందిన వాడని, ఆ వ్యక్తితో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు నలుగురు ఉన్నారని, దొంగ ఓట్లు వేస్తుంటే వాళ్లు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లో మీడియా ద్వారా ఆరోపణలు చేసిన వ్యక్తే గంటకోసారి పోలింగ్ కేంద్రాల వద్దకు పరిశీలన చేశాడని, దొంగ ఓట్లు ఎలా వేశారో ఆయన చెప్పాలని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై ఉన్న ప్రజాదరణను చూసి ఓర్వలేక బురద చల్లడం సబబు కాదన్నారు. కుట్రపూరితంగా రాద్ధాంతం చేస్తున్న విషయం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ రమేష్‌బాబు, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి తదితరులున్నారు.

దళిత మహిళా సర్పంచ్‌పై దాడి హేయం

- భౌతిక దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు
- టీడీపీ నేతలు కవ్వింపు చర్యలు మానుకోవాలి
- వైఎస్సార్ సీపీ సర్పంచులు స్పష్టం



మాట్లాడుతున్న బాబురెడ్డి

రామకుప్పం: 89 పెద్దూరు సర్పంచ్ మల్లిక, ఆమె భర్త గోవిందప్పపై దాడి హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆకందగానిపల్లెలో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు విలేకరుల సమావేశం నిర్వహించారు. బాబురెడ్డి మాట్లాడుతూ ననియాల గ్రామంలో టీడీపీ నేతల ఆగడాలకు అడ్డుగా ఉన్నారని సర్పంచ్ మల్లిక దంపతులపై ఆపార్టీ నేతలు గజేంద్ర, మనోహర్ దాడి చేయడం గర్హనీయమన్నారు. భౌతిక దాడుల సంస్కృతిని టీడీపీ నేతలు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే తగినమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. సర్పంచ్ దంపతులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత సర్పంచ్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌గోపాల్ తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు మోహన్‌నాయక్, రాజా, ఇంద్రప్ప, బావాజీ, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, రెస్కో డైరెక్టర్లు నాగిరెడ్డి, రవినాయక్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుగుణప్ప, పార్టీనేతలు మురుగేష్, భాస్కర్‌నాయక్, భూషణ్‌నాయక్, రాంబాబు, అరవింద్, గుర్రప్ప, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా దాదేపల్లె ఉరుసు ప్రారంభం



పూలు, చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లి: మండలంలోని దాదేపల్లెలోని మషాయక్ బహద్దూర్ అలీషా బాబా ఉరుసు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దర్గా వద్ద విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో ఏర్పాటు చేసిన మక్కా మదీనా కటౌట్ విశేషంగా ఆకర్షించింది. మంగళవారం రాత్రి పకీర్ల జోహార్ల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చిన గంధంను దర్గా వద్దకు తీసుకొచ్చి బాబాహ్‌కు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు, దువ్వా నిర్వహించారు. కులమతాలకతీతంగా భక్తులు దర్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముంబాయికి చెందిన గాయకులు జీటీవీ సింగర్ కౌసర్ సాబరి, ఉత్తర ప్రదేశ్ సహన్‌పూర్‌కు చెందిన అస్లాం ముకరం సాబరి ఖవ్వాలీ ఆకట్టుకుంది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూలచాదర్‌ను మజ్జార్‌పై కప్పి బాబావారి ఆశీస్సులు పొందారు. భక్తులుకు సదుపాయాలను మసీదు, ఉరుసు నిర్వాహక కమిటీ సభ్యులు కల్పించారు. అన్నదానం చేశారు.

చాదర్ సమర్పించిన పెద్దిరెడ్డి

ఉరుసును పురస్కరించుకుని బాబాకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి చాదర్‌ను సంప్రదాయ ప్రకారం కప్పారు. పార్టీ నేతలు పూల వర్షం కురిపిస్తూ ఆయనకు స్వాగతించారు. ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలంటూ దువా చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్, చౌడేపల్లె, సదుం కో ఆప్షన్ మెంబర్లు సాధిక్‌బాషా, ఇమ్రాన్, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్‌లు అల్తాఫ్, కృష్ణమరాజు, మత పెద్దలు సుల్తాన్‌సాబ్, సుల్తాన్ సాబ్, సాధిక్‌బాషా, షేర్‌ఖాన్, చిన్నరెడ్డిబాషా, ఆరీపుల్లా, అమానుల్లా, సనావుల్లా, లతీఫ్, బాబాజాన్, బషీర్‌సాబ్, సయ్యద్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న నాయకులు

శాంతిపురం: అనారోగ్యానికి గురై బెంగళూరు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల కింద నగదు మంజూరైంది. రేగడదిన్నేపల్లి పంచాయతీ నల్లపరెడ్డియూరుకు చెందిన రామనాథరెడ్డికి రూ.1.20 లక్షలు, దండికుప్పం పంచాయతీ ఇందిరాకాలనీకి చెందిన జనార్దన్‌కు రూ.75 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. మంగళవారం మండల సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి చెక్కులను అందజేశారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

పెద్దపంజాణి: మండలంలోని పెద్దారికుంట పంచాయతీ కార్యదర్శి రవీంద్ర అనారోగ్యంతో మంగళవారం ఉదయం సోమల మండలం ఆవులపల్లెలోని స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, పార్టీ నాయకులు, మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవులపల్లికి చేరుకున్నారు. మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, సర్పంచ్ భాస్కర్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ. 25 వేలను ఎంపీపీ, మండల కన్వీనర్ బాగా రెడ్డి అందజేశారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పవన్‌కుమార్, పీఎస్‌లు మహేష్, శ్రీనివాసులు, గణపతి పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

చౌడేపల్లి: సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ సేవలపై మంగళవారం కళాజాతతో అవగాహన కల్పించారు. పంట, బంగారుపై రుణాలు, సోషియల్ సెక్యూరిటీ స్కీమ్‌లు, పీఎం జేజేబీవై, పీఎంఎస్‌బీవై, డిజిటల్ సేవలపై అవగాహన కల్పించారు. డీసీసీబీ బ్రాంచ్ మేనేజరు కె.వెంకటేష్‌బాబు మాట్లాడుతూ ఫిక్సిడ్ డిపాజిట్లకు అధిక వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు, ఆధార్, ఓటీపీ వివరాలను తెలియజేయకూడదని తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, డైరెక్టర్‌లు రమేష్ బాబు, యోగానంద, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు విలువలు పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

గుడుపల్లె: వైద్య వృత్తిని ప్రారంభించేవారు సమాజంలో విలువలు పాటిస్తూ సేవా దృక్పథంతో నడుచుకోవాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబరు డాక్టర్ ఎస్‌వీకే ప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడికల్ ఎథిక్స్ అండ్ అవర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ డాక్టర్లుగా విలువలు, రోగులతో ఎలా మెలగాలి, రోగి వివరాల గోప్యత, సర్టిఫికేషన్‌ను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్ ఆర్ కృష్ణారావు, సుజాత పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు చెరువు కట్ట మలుపులో సోమవారం సాయంత్రం పల్సర్‌బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పురుషోత్తమన్(26) సోమవారం రాత్రి స్థానిక ఏరియా ఆస్పత్రిలో మృతిచెందాడు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన కార్తికేయన్ కుమారుడు రాహుల్(21), గుడియాత్తం తాలుకా సైనిగుంటకు చెందిన రజకన్ కుమారుడు సాయి పురుషోత్తమన్(26) బైక్‌పై రెండ్రోజుల కిందట పలమనేరుకు వస్తుండగా ఎదురుగా వెళుతున్న లారీ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రాహుల్ తల ఛిద్రమై అక్కడిక్కడే మృతిచెందాడు. బైక్‌లో వెనుక కూర్చొని ఉన్న పురుషోత్తమన్ తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలో ఉంటూ కాసేపటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం



చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లెలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. యానాది విజయలక్ష్మికి చెందిన గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపో యింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

నులి పురుగులను నులిమేద్దాం



పలమనేరు : ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న వైద్యాధికారి అనొహి

పలమనేరు: నులిపురుగులతో ఏర్పడే రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మింగాలని వైద్యాధికారులు సూచించారు. నేషనల్ డీవార్మింగ్‌డే సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం విద్యార్థులచే మింగించారు. కొలమాసనపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెంగరగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ– పిల్లలో రక్తహీనత అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వైద్యాధికారి అనొహి విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనంలో ఇబ్బందిపెట్టే వ్యాధులకు రక్తహీనతే ప్రధాన సమస్యగా ఉందన్నారు. దీని నివారణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మండలంలో ఒకటి నుంచి 18 ఏళ్లలోపు వయసున్న సుమారు 13 వేల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశామన్నారు. 69 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ సిరప్ తాగించినట్లు తెలిపారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి జయశంకర్ మాట్లాడుతూ చేతులను శుభ్ర పరచుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆరోగ్య సిబ్బంది కుసుమ, ఖైరూన్, అశ్విని, సెల్వి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి జానకిరావు పర్యవేక్షణలో అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు మింగించారు. హెచ్‌ఎం తాతయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వి.కోట: మండలంలోని ఓగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌నాయక్ నులిపురుగుల నివారణకు విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 19,029 మంది పిల్లలకు మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు 97 శాతం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో

సదుం: మహాత్మా జ్యోతీరావ్ పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి చరణ్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు మాత్రలు తీసుకోవాలని, శారీరక, మానసిక ఎదుగుదలకు, రక్తహీనత నివారణకు పని చేస్తాయని చెప్పారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయ భాస్కర్, నీలకంఠ పాల్గొన్నారు.

హెల్త్ కమిషనరేట్ అబ్జర్వర్ పర్యవేక్షణ

రామకుప్పం: విజలాపురం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 3603 మంది విద్యార్థులకు మాత్రలను మింగించినట్లు తెలిపారు. విజయవాడ హెల్త్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అబ్జర్వర్ మహేష్ విజలాపురం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన కార్యకమాన్ని పరిశీలించారు. వైద్యాధికారి సాదియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లెలో ..

చౌడేపల్లి: గోసలకురప్పల్లె ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ కేశవరెడ్డి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ సరళాదేవితో కలిసి వైద్యాధికారులు పవన్‌కుమార్, శ్రీకాంత్ ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులతో మింగించారు. తెలిపారు. మండలంలో 8,836 మందికి మాత్రలు అందజేయాల్సి ఉండగా, తొలిరోజు 8,424 మంది విద్యార్థులకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మింగించారు. హెచ్‌ఎం నాగరాజ పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: వైద్యాధికారులు శివప్రతాప్, విజయలక్ష్మి, రమ్యశ్రీ ఆధ్వర్యంలో సోమల, కందూరు,పెద్ద ఉప్పరపల్లె పీహెచ్‌సీల పరిధిల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఎంఈఓ కేశవపిళ్లై, హెచ్‌ఎం శివరత్నమ్మ, సీహెచ్‌ఓ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర వ్యక్తిగత శుభ్రత ముఖ్యమన్నారు. ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం డిగ్రీ కళాశాలలో..

కుప్పంరూరల్: కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలు మింగించారు. అనంతరం అంతర్జాతీయ పై దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు మాధవి, భార్గవి, ప్రభుదాస్, రామసుబ్బారెడ్డి, గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: బాలికల ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. రక్తహీనతకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంఈవో హసన్‌బాషా, సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పార్వతమ్మ, హెచ్‌ఎం, పాల్గొన్నారు.



కల్లూరులో



వి.కోటలో ..



కుప్పం డిగ్రీ కళాశాలలో ..



సోమలలో..



రామకుప్పం : మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్



చౌడేపల్లెలో ..